# ఆకలి ఆట

ఎస్. రవీందర్ రావు

నేనొక గుమాస్తాని. నాకు ఆస్తి, ఐశ్వర్యాలు లేవు. గొప్ప సరదాలు, డబ్బున్న స్నేహితులూ, బంధువులూ లేరు. నాకు వున్నదల్లా నా భార్యాపిల్లలు. వాళ్ళే నా కంటి వెలుగూ– నా ఇంటి దీపాలూ. వాళ్ళు లేందే నేనొక్క క్షణమైనా బతకలేను. వాళ్ళ కోసమే నేను పొద్దస్తమానం పనిచేస్తాను.



వాళ్ళకూ కూడా నేనంటే చాలా ఇష్టం. కాని ఒక విషయంలో మా పిల్లలకి నామీద చాలా అసంతృప్తిగా వుండేది. వాళ్ళకిష్టం అయిన కూరలు నేనెప్పుడూ మార్కెట్నుంచి తెచ్చేవాణ్ణికాదు. అయినా ప్రతి రోజూ నేను కూరలకి వెళ్ళేటప్పుడు "నాన్నగారూ యివాళ వంకాయలు తెండనో, ఆలుగడ్డలు తెండనో" చెప్పకుండా వూరుకునేవారు కారు. కానీ నేనెప్పుడూ దానికి భిన్నంగానే ప్రవర్తించేవాణ్ణి. వాళ్ళు తెమ్మన్నవికాక వేరేవి ఏమైనా తెచ్చేవాణ్ణి. అలాగని నేను తెచ్చే కూరలు నాకొక్కడికే ఇష్టమైనవని అనుకోవడానికి వీల్లేదు.

మా పిల్లలకి ముద్ద పప్పంటే యిష్టం. వంకాయ కూరంటే మరీ యిష్టం. ఆలుగడ్డలన్నా, క్యాబేజి అన్నా, కాలీఫ్లవరన్నా కూడా యిష్టమే. ఏ పండుగ రోజుల్లోనో తప్ప ఈ కూరగాయలు నేనెప్పుడూ తెచ్చేవాణ్ణి కాదు. అలాగని నేను సాధారణంగా తెచ్చేవి మా పిల్లలకి ఇష్టంలేని కాకరకాయ, బెండకాయ, దొండకాయ, బీరకాయ లాంటి కూరగాయల కంటే యివి ఏమంత ఖరీదైనవి కావు.

నాతో వాళ్ళకిష్టం అయిన కూరలు తెమ్మని చెప్పిచెప్పి విసిగిపోయిన మా పిల్లలు చివరికి వాళ్ళే మార్కెట్‌కి వెళ్ళి కూరలు తెచ్చుకుంటామని అడిగారు. అందుకు నేను ససేమిరా ఒప్పుకోలేదు. వాళ్ళు పెద్దవాళ్ళయి ఉద్యోగాలు చేసేవరకూ కూరగాయలు తెచ్చే బాధ్యత నాదేనని చెప్పాను. అయినా అప్పుడప్పుడూ మార్కెట్‌కి వెళ్ళి కూరగాయలు తెచ్చుకుంటామని అడుగుతూనే వుండేవారు. నాకెంత ముఖ్యమైన పని వున్నా, రోజూ కూరగాయలు తెచ్చేపని మాత్రం మానుకునేవాణ్ణి కాదు.

అలాంటిదొకసారి అనుకోకుండా నాకు జ్వరం రావడం వల్ల నాలుగు రోజులు

## మినీ కథా వీథి

మంచాన పడ్డాను. ఆ నాలుగు రోజులూ నేను ఆఫీసుకి వెళ్ళలేదు. కూరలు తేలేదు. ఆ నాలుగు రోజులూ పిల్లలు కూడా దిక్కుమొహం వేసుకున్నారు. ఎవరి ముఖాన కూడా నవ్వు కనిపించలేదు. ఆ నాలుగు రోజులూ వాళ్ళు బయటికి వెళ్ళి కూరగాయలు తెచ్చుకోలేదు. ఇంట్లో వున్న పచ్చళ్ళతోటి కాలక్షేపం చేశారు.

నాలుగో రోజు సాయంత్రం నాకు జ్వరం తగ్గింది. అయిదోనాడు డాక్టర్ అన్నం తినొచ్చని చెప్పాడు. ఆ రోజు మా పిల్లల కళ్ళల్లో నేను చూసిన వెలుగు నేనెప్పటికీ మరిచిపోలేను.

ఆ రోజు పిల్లలు కూరగాయలు తెస్తామని పట్టుపట్టారు. ఒంట్లో కాస్త నీరసంగా వుండటం మూలాన కాదనలేకపోయాను. వాళ్ళు మార్కెట్‌కి వెళ్ళి వాళ్ళకిష్టమైన కూరగాయలు తెచ్చేరు. మా ఆవిడ వడ్డిస్తుండగా పిల్లలతో కలిసి నేను ఆనందంగా భోజనం చేశాను, పిల్లలు నవ్వుతూ తుళ్ళుతూ సంతృప్తిగా కడుపునిండా భోంచేశారు. విచిత్రం ఏమిటంటే ఆనాటి తరువాత మా పిల్లలు ఎప్పుడూ కూరగాయలు తెస్తామని అడగలేదు. పోనీ నేను కూరగాయలకు వెడుతున్నప్పుడు

కూడా ఫలానా కూరగాయలు తెమ్మని అడగలేదు. విషయం ఏమిటో కనుక్కోవాలని చివరికి ఒకనాడు పిల్లల్ని పిలిచి కూరగాయలు తెమ్మని డబ్బులు ఇచ్చాను.

"ఏం కూరలు తేవాలి నాన్నా" అని అడిగారు వాళ్ళు.

"మీ ఇష్టం అయినవి తెచ్చుకోండి" అని చెప్పి పంపాను.


మార్కెట్నుంచి వాళ్ళ కేమాత్రమూ ఇష్టం లేని బీరకాయలు తెచ్చారు. అది చూసి "ఇవి ఎందుకు తెచ్చుకున్నారు?" అని అడిగాను.

ముందుగా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. తిరిగి రెట్టించేసరికి మా పెద్దవాడు "మీకు జ్వరం తగ్గినరోజు మాకు ఇష్టం అయిన కూరలు తెచ్చుకున్నందుకు మేమంతా బాగా తిన్నాం. అమ్మకి అన్నం మిగల్లేదు. అందుకని యివాళ బీరకాయలు తెచ్చుకున్నాం" అని చెప్పాడు.

"ఇప్పుడు మాకు బీరకాయలంటే చాలా యిష్టం నాన్నగారూ" అంది మా అమ్మాయి.

నా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. వాస్తవానికి నేనుకూడా మా కెవరికీ యిష్టంలేని కూరలు తేవడానికి కారణం, మేమంతా సంతృప్తిగా తింటే నాకొచ్చే జీతం సరిపోదనే.

### నా గురించి



పేరు ఎస్. రవీందర్‌రావు.

తండ్రి మహోదర్‌రావు.

ఊరు: గంగాధర, కరీంనగర్ జిల్లాలో. పెరిగిందీ జీవితాన్ని చూసిందీ కూడా హైద్రాబాద్ మహానగరంలోనే. విద్యాభ్యాసంలో అక్షరాభ్యాసం నేరిస్తే, సాహిత్యాభ్యాసం నందిగం క్రిష్ణ, జింబో గార్ల దగ్గరే. వాళ్ళిద్దరికీ నా కృతజ్ఞతలు

అభిమాన రచయితలు– చలం, శ్రీశ్రీ, గోర్కీ, కొ. కు. రావిశాస్త్రి, బీనాదేవి.

చదువుతున్నది ఎల్. ఎల్. బి. మూడో సంవత్సరం ఉస్మానియా యూనివర్సిటీలో. ఇదే నా మొదటి కథ.

—ఎస్. రవీందర్ రావు